


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4 PM
www.suryaa.com
సోమవారం
25-08-2025
పేజీలు: 02

## 15 రోజుల్లో కోదండరామ్‌కు మళ్లీ ఎమ్మెల్సీ..

# సీఎం రేవంత్ సంచలన ప్రకటన



ప్రొఫెసర్ కోదండరామ్‌ను మరో 15 రోజుల్లో మళ్లీ ఎమ్మెల్సీని చేసి శాసన మండలికి పంపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా చేసిందని గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ నేతలు.. సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఆయన పదవిని తీయించేశారని విమర్శించారు. ప్రొ. కోదండరామ్ ఎమ్మెల్సీ పదవిని ఊడకొట్టేందుకు రూ. కోట్లు ఖర్చు చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. అయినా.. ఎందుకు అంత శునకానందం మీకు అంటూ.. బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులేనన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి సైతం ఈ యూనివర్సిటీ విద్యార్థినేని పేర్కొన్నారు. తెలంగాణ నలుమూలల్లో ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది యూనివర్సిటీలోనే తెలిపారు. చదువుతోపాటు పోరాటాన్ని సైతం నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అని అభివర్ణించారు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది ఈ యూనివర్సిటీనే అని వివరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే అని తెలిపారు. అలాగే యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు రాష్ట్ర సాధనలో భాగంగా సమిధలయ్యారని పేర్కొన్నారు. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీదన్నారు. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగిందంటూ మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని తాము ఆలోచన చేశామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించామని గుర్తు చేశారు. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించామని వివరించారు. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి విచ్చే శారు. ఈ సందర్భంగా ఆయన పలు భవనాలను ప్రారంభించారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

**వారి ఎమ్మెల్సీలు రద్దు చేసిన సుప్రీంకోర్టు..**

ఎమ్మెల్సీలు ప్రొ. కోదండరామ్,అమీర్ అలీఖాన్ సభ్యత్వాన్ని సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వీరిద్దరిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించారు. అయితే వీరి నియామకాలపై బీఆర్ఎస్ నేత దాసోజ్ శ్రవణ్, సత్యనారాయణలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలుగా వీరిద్దరి నియామకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. మరో 15 రోజుల్లో ప్రొ. కోదండరామ్‌ను ఎమ్మెల్సీని చేసి శాసన మండలికి పంపుతానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## గగన్‌యాన్ ప్రాజెక్టులో ఇస్రో ముందడుగు



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఆదివారం అత్యద్భుత రీతిలో తొలిసారిగా ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టు (ఐఏడిటి 01) ను నిర్వహించింది. గగన్‌యాన్ దశలో అత్యవసరం అయ్యే పారాచూట్‌ల ద్వారా నేలవాలే ఈ డ్రాప్ సిస్టమ్ పనితీరును ఇస్రో సాంకేతిక విభాగం పూర్తి స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట వద్ద పరీక్షించింది. ఈ విన్యాసాన్ని ఇస్రో, భారతీయ వాయుదళం, డిఆర్‌డిఓలు సంయుక్తంగా నిర్వహించాయి. భారతీయ నావికాదళం, భారతీయ తీర ప్రాంత రక్షణ దళం కూడా ఈ ప్రక్రియలో పాలుపంచుకుందని అధికార వర్గాలు తెలిపాయి. భారతదేశం 2027లో మానవుడిని అంతరిక్షంలోకి తీసుకువెళ్లి, తిరిగి భూమిపైకి సురక్షితంగా చేర్చే ప్రతిష్టాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టును ఇస్రో పర్యవేక్షణలో చేపట్టింది. ఇది దేశానికి తొలి మానవయుత అంతరిక్ష యాన కార్యక్రమం. ఇది విజయవంతం అయ్యేందుకు పారాచూట్ వాడకం కీలకం అవుతుంది. మనుషులను తీసుకువెళ్లే, కిందికి తీసుకువచ్చే మాడ్యూల్ భూవాతావరణం నుంచి దాటి వెళ్లేటప్పుడు, ఈ భూ కక్షలోకి చేరుకునే దశలో వేగం, సమన్వయం కల్పించుకునే క్రమంలో పారాచూట్‌ల డ్రాప్ విధానం అత్యవసర అంతర్భాగం అవుతుంది. ఈ వ్యవస్థ పనితీరును ఇప్పుడు విజయవంతంగా పరీక్షించడం ఇస్రో పరిశోధనల దిశలో కీలకం అయింది. క్రూ మాడ్యుల్‌కు ఈ పారాచూట్ సంబంధిత ఎయిర్ డ్రాప్ టెస్టు ప్రధానమైనది. ఈ వ్యవస్థ సక్రమంగా పనిచేసిందని ఇస్రో వర్గాలు తెలిపాయి.

## లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ..

# భార్యాభర్తలు మృతి

మహారాష్ట్రలోని పుణెలో కాలేయ మార్పిడి చేయించుకున్న భార్యాభర్తలు మృతిచెందారు. భర్తకు లివర్ అవయవాన్ని దానం చేసిన భార్య.. తన భర్త చనిపోయిన కొన్ని రోజులకే ప్రాణాలు విడిచింది. దీంతో మహారాష్ట్ర సర్కారు పుణెలోని ప్రైవేటు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేసింది. సహ్యాద్రి ఆస్పత్రిలో కాలేయ మార్పిడి సర్జరీ జరిగింది. ఆ ప్రొసిడజర్‌కు చెందిన పూర్తి వివరాలను ఇవ్వాలని ఆరోగ్యశాఖ కోరింది. ఆస్పత్రికి నోటీసులు జారీ చేసినట్లు ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ నాగనాథ్ యంపల్లి తెలిపారు. గ్రహీత, దాతకు చెందిన వీడియో రికార్డులను సమర్పించాలని ఆదేశించారు. బాధిత తంపతులను బాబూ కోమ్కార్, అతని భార్య కామినిగా గుర్తించారు. భర్త బాపుకు తన కాలేయాన్ని డోనేట్ చేసింది కామినీ. ఆగస్టు 15వ తేదీన ఆ సర్జరీ జరిగింది. కాలేయ మార్పిడి శస్త్రచికిత్స తర్వాత బాపు కోమ్కార్ ఆరోగ్యం క్షీణించింది. అతను ఆగస్టు 17వ తేదీన చనిపోయాడు. అయితే ఇన్‌ఫెక్షన్ సోకడం వల్ల ఆగస్టు 21వ తేదీన కామిని మృతిచెందింది.



## పెళ్లిపై లాలూ ప్రసాద్ యాదవ్‌తో మాటమంతీ కొనసాగుతోందన్న రాహుల్ గాంధీ


లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన పెళ్లి గురించి సరదా వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో జరిగిన ఓ మీడియా సమావేశంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, రాహుల్ గాంధీ మధ్య చోటుచేసుకున్న సరదా సంభాషణ నవ్వులు విరజిమ్మింది.'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా అరారియాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్‌కు ఇక పెళ్లి చేసుకోవాలని సూచించారు. దీనిపై పక్కనే కూర్చున్న రాహుల్ గాంధీ స్పందించారు. వెంటనే రాహుల్ మైక్ అందుకుని "ఆ సూచన నాకూ వర్తిస్తుంది" అంటూ నవ్వులు పూయించారు.తదుపరి తేజస్వీ స్పందిస్తూ, "ఇదే విషయాన్ని మా నాన్న లాలూ ప్రసాద్ యాదవ్‌ఎప్పటి నుంచో చెబుతున్నారు కదా" అని వ్యాఖ్యానించగా, రాహుల్ గాంధీ వెంటనే స్పందిస్తూ, 'అవును, దీనిపై ఆయన లాలూ ప్రసాద్ యాదవ్తో సంభాషణ కొనసాగుతోంది' అంటూ రాహుల్ చమత్కరించారు.రెండేళ్ల క్రితం పట్నాలో రాహుల్ గాంధీ పెళ్లిపై లాలూ ప్రసాద్ యాదవ్ తనదైన శైలిలో మాట్లాడి నవ్వులు పూయించిన విషయం తెలిసిందే. 'మా మాట విని పెళ్లి చేసుకో మేమంతా నీ బరాత్ వివాహం కు రావాలనుకుంటున్నాం. వివాహానికి విముఖత చూపుతుండటంతో మీ అమ్మ సోనియా గాంధీ ఆందోళన చెందుతోంది' అని లాలూ నాడు వ్యాఖ్యానించారు. తాజా సమావేశంలో ఇదే విషయాన్ని రాహుల్ ప్రస్తావనకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.గంభీరమైన రాజకీయ చర్చల మధ్య నేతలు ఇద్దరు చేసిన ఈ హాస్యాస్పద వ్యాఖ్యలు అక్కడి ప్రజలను, మీడియా ప్రతినిధులను నవ్వించాయి.

## హాట్ బ్యూటీ

# రాశి సింగ్

రాశి సింగ్.. సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తుంది. నిత్యం లేటేస్ట్ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ వ్యయారి.. ఇప్పుడు తాజాగా షేర్ చేసిన ఫోటోస్ నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి.ఈ బ్యూటీకి ఇన్ స్టాలో ఓ రేంజ్ ఫాలోయింగ్ ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది. ఓ వైపు గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూనే.. మరో వైపు ట్రెడిషనల్ లుక్ లోనూ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను కవ్విస్తుంది ఈ వయ్యారి భామ. సినిమాల్లో కాస్త పద్ధతిగా కనిపించినా.. అటు ఇన్ స్టాలో మాత్రం గ్లామర్ ఫోజులతో రచ్చ చేస్తుంది. అయినా ఈ బ్యూటీకి టాలీవుడ్ ఇండస్ట్రీలో మాత్రం అవకాశాలు రావడం లేదు. సుహాస్ నటించిన ప్రసన్న వదనం సినిమాతో మెప్పించింది.ఈ మూవీతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం రావడం లేదు. అంతకు ముందు అరడజను చిత్రాల్లో నటించినప్పటికీ సరైన క్రేజ్ మాత్రం రావడం లేదు. సోషల్ మీడియాలో మాత్రం తన అందంతో కుర్రకారును విపరీతంగా కవ్విస్తుంది ఈ హాట్ బ్యూటీ.



## కేజీఎఫ్ నటుడు కన్నుమూత

చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. స్టార్ నటుడు మృతి చెందారు. సూపర్ హిట్ మూవీ కేజీఎఫ్ సినిమాలో బాంబే డాన్ శెట్టి పాత్రలో నటించి మెప్పించిన కన్నడ నటుడు దినేష్ మంగళూరు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దినేష్.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం ఆయన వయసు 63. ఈ విషయాన్ని దినేష్ కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. మంగళవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దినేష్ మరణ వార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. కాగా, దినేష్ మంగళూరు నటుడిగానే కాకుండా దాదాపు 200 చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. వీర మదకరి, చంద్రముఖి ప్రాణసకి, రాక్షస వంటి సినిమాల్లో ఆర్ట్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందారు.



## రాష్ట్రంలో గంటకు 14 మందిని

# కరుస్తున్న కుక్కలు


గత ఏడాది 1.21 లక్షల మంది కుక్కకాటు బాధితులు, తెలంగాణలో రోజురోజుకు పెరిపోతున్న వీధికుక్కల సమస్య, గత ఏడాది 1,21,997 మంది కుక్కకాటు బారిన పడగా, ఈ ఏడాది జూలై వరకు కుక్కకాటుకు గురైన 87,366 మంది బాధితులు, గత ఏడాది దేశవ్యాప్తంగా 31 లక్షల కుక్కకాటు కేసులు నమోదవ్వగా, బాధితుల్లో అధికంగా 15 ఏళ్ల లోపు వారు ఉన్నారని తెలిపిన అధికారులు. తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది గంటకు 14 మంది కుక్కకాటుకు గురవ్వగా, 13 మంది రేబిస్ వ్యాధితో మృతి చెందినట్టు తేల్చిన రాష్ట్ర ప్రభుత్వ లెక్కలు.

# ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ 9 జిల్లాల్లో ప్రారంభమైంది. చౌకబియ్యం పక్కదారి పట్టకుండా నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డులను నేటి నుంచి పంపిణీ చేస్తోంది. లబ్ధిదారులకు సాంకేతిక హంగులతో స్మార్ట్ కార్డులు అందిస్తున్నారు. క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు రూపొందించారు. దీనివల్ల రాష్ట్రంలో ఎక్కడి వారైనా, ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే సదుపాయం కల్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పంపిణీ ప్రక్రియ వచ్చే నెల 15 తేదీ వరకు 4 విడతల్లో జరగనుంది.

ఉచితంగా 1.45 కోట్ల కుటుంబాలకు: 9 జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మొదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడలో వరలక్ష్మీ నగర్‌లో స్మార్ట్ రైస్ కార్డులను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు స్మార్ట్ కార్డులను ప్రారంభించారు. అనంతరం సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నారు. 15 రోజుల్లో 1.45 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు ఉచితంగా ఇంటింటికీ వెళ్లి అందించనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 6.70 లక్షల కార్డుదారులతో పాటు అడ్రస్ మార్పు చేసుకున్న వారికీ స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ సహా పలు సాంకేతిక అంశాలతో స్మార్ట్ కార్డులు తయారు చేశారు. రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ పోస్ యంత్రాలనూ ప్రభుత్వం ఆధునికీకరించింది. స్మార్ట్ రైస్ కార్డుతో స్కాన్ చేసి బయోమెట్రిక్, ఐరిష్ గుర్తింపుతో సరకులు పంపిణీ చేసే ఏర్పాట్లు చేశారు. సరకుల పంపిణీ సమాచారం ఎప్పటికప్పుడు కేంద్ర సర్వర్‌కు చేరవేసేలా రూపొందించారు. రేషన్, సరకుల పంపిణీలో అక్రమాలు వివరించడమే లక్ష్యంగా నూతన వ్యవస్థ తెచ్చినట్లు ప్రభుత్వం తెలియజేసింది. రాష్ట్రంలో ఎక్కడి వారు ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే సదుపాయం కల్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ: రాష్ట్రంలో నేటి నుంచి మొదటి విడత ప్రక్రియ కొన్ని జిల్లాల్లో ప్రారంభించారు. అదే విధంగా రెండో విడతను ఈనెల 30వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ రైస్ కార్డులను ఏటీఎం కార్డు తరహాలో జేబులో ఇమిడి పోయే విధంగా తయారు చేశారు. ఈ స్మార్ట్ కార్డులపై ఒకవైపు రాజముద్రతో పాటు లబ్ధిదారు ఫొటో ఉండే విధంగా రూపొందించారు. మరోవైపు క్యూఆర్ కోడ్ ఉండేలా ముద్రించారు. కార్డుపై ఎటువంటి రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొత్తగా రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా త్వరలోనే కార్డులు రానున్నాయని అధికారులు పేర్కొన్నారు.




## నటి లైంగిక వేధింపుల ఆరోపణలు.. ఎమ్మెల్యేను సస్పెండ్ చేసిన కాంగ్రెస్

కేరళ కాంగ్రెస్‌లో ఓ నటి చేసిన ఆరోపణలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చలకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధికారి రాహుల్ మామకుటత్తిల్‌పై తక్షణ చర్యలు చేపట్టారు. ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేశారు. రాహుల్ ప్రస్తుతానికి పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఓ ప్రముఖ పార్టీకి చెందిన యువనేతతో అనుచితంగా వ్యవహరించడం, మూడేళ్లుగా వేధించడం జరిగింది అని నటి రీని జార్జ్ ఒక ఇంటర్వ్యూలో ఆరోపించారు. ఈ విషయాన్ని ఆమె పార్టీ సీనియర్ నాయకుల దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చినప్పటికీ, సమస్య పరిష్కారం కాలేదు అని ఆమె వాపోయారు. రీని జార్జ్ రాహుల్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినా, భాజపా, సీపీఎం శ్రేణులు ఆయన ప్రమేయం ఉన్నారని ఆరోపించినట్లు తెలుస్తోంది.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా

ఈ పరిస్థితుల్లో, రీని జార్జ్ రాజీనామా చేయాలని నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా ప్రకటించారు.

రాజీనామా ప్రకటించిన తర్వాత రాహుల్ మాట్లాడుతూ, "నాపై వచ్చిన ఆరోపణల గురించి పార్టీ పెద్దలతో చర్చించాను. ఎవరూ నన్ను రాజీనామా చేయమని చెప్పలేదు. ఆ నటి నా స్నేహితురాలు. ఆమె ఆరోపించిన వ్యక్తి నేను కాదని నమ్ముతున్నాను. నేను ఏ విధమైన చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడలేదు" అని పేర్కొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి జోక్యంతో సినీ పరిశ్రమలో సమ్మె సమస్యకు పరిష్కారం



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సినీ ప్రముఖులు ధన్యవాదాలు తెలిపారు. సినీ పరిశ్రమ కార్మికుల సమ్మె కారణంగా ఇటీవల దాదాపు రెండు వారాలకు పైగా షూటింగ్‌లు నిలిచిపోయిన విషయం విదితమే. ఈ క్రమంలో పలు సినిమాల నిర్మాణాలు ఆగిపోవడంతో సినిమాల విడుదలలు కూడా వాయిదా పడ్డాయి. సినీ పరిశ్రమలోని పెద్దలు, నిర్మాతలు, సంబంధిత యూనియన్ నేతల మధ్య పలు దఫాలు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సమ్మె రెండు వారాలకు పైగా కొనసాగింది. ఈ పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవడం, ఆయన సూచనలతో ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరిపి కార్మికుల సమ్మె విరమణకు చర్యలు తీసుకోవడంతో పరిశ్రమకు భారీ ఊరట లభించింది. ఈ పరిణామాల నేపథ్యంలో టాలీవుడ్ నిర్మాతల సంఘం ప్రతినిధులు నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. సినీ పరిశ్రమలో తరచూ తలెత్తుతున్న వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పరిశ్రమ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఒక సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. నిర్మాతలు, కార్మికులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ఒక ఉమ్మడి విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



## భారత్ స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది: మోదీ



దేశీయ ఉత్పత్తులను ఆదరించాలని ప్రధాని మోదీ కోరారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'ఈ ఏడాది చివరి నాటికి మార్కెట్‌లో దేశీయంగా తయారు చేసిన సెమికండక్టర్ చిప్ అందుబాటులోకి వస్తుంది. అలాగే స్వదేశీ 6జీ నెట్‌వర్క్ కూడా వేగంగా పురోగతి సాధిస్తోంది. ప్రస్తుతం ప్రపంచ దేశాలు వృద్ధాప్య సమస్యను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచానికి యువతను అందించే సత్తా భారత్‌కు ఉంది. రాబోయే రోజుల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది.

## హిట్టుకొట్టిన వదలని బ్యాడ్ లక్

హీరోయిన్ పూజా హెగ్డే గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. తెలుగు, తమిళం భాషలలో అగ్ర హీరోలందరితో కలిసి నటించి స్టార్ డమ్ సంపాదించుకుంది. తక్కువ సమయంలోనే వరుస సినిమాలతో దూసుకుపోయిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు మాత్రం సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన ఈ అమ్మడు.. ముకుంద, ఒక లైలా కోసం సినిమాలతో తెలుగు తెరకు పరిచయమైంది. కెరీర్ మొదట్లో ఫ్లాపులే అందకున్నప్పటికీ అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది. దీంతో ఈ బ్యూటీకి ఆఫర్స్ క్యూ కట్టాయి. దువ్వాడ జగన్నాథం, అరవింద సమేత, మహర్షి, గద్దలకొండ గణేష్, అలా వైకుంఠపురంలో వంటి చిత్రాలతో వరుసగా హిట్లు అందుకుంది. అయితే వరుస హిట్లే కాదు.. ఆ తర్వాత వచ్చిన ఫ్లాపులు అమ్మాడి కెరీర్ ను అయోమయంలో పడేశాయి. రాధేశ్యామ్, ఆచార్య, బీస్ట్ చిత్రాలు డిజాస్టర్స్ కావడంతో పూజా సైలెంట్ అయ్యింది.



## యూరియా కోసం రైతన్నల హరిగోస

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎరువుల కొరత మరోసారి రైతులను కష్టాల్లోకి నెట్టింది. తెల్లవారుజాము నుంచే ఆధార్ కార్డులు లైన్లో పెట్టి, యూరియా ఎరువు కోసం వేచి చూస్తున్న రైతన్నలతో మార్కెట్ యార్డ్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వర్షాకాలం సాగు పనుల్లో భాగంగా రైతులు యూరియా కోసం ఎదురు చూస్తుండగా, సరఫరాలో నెమ్మదితో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి రోజు వందలాది మంది రైతులు కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడుతున్నా, సరిపడా స్టాక్ లేకపోవడంతో చాలా మంది నిరాశతో తిరుగు ప్రయాణం చేస్తున్నారు.



## వేరొకరితో ఫోన్ మాట్లాడుతుందని భార్యను హత్య చేసిన భర్త

నాగర్ కర్నూల్ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన శ్రీశైలం రాంగ్ నెంబర్ ద్వారా పరిచయమైన శ్రావణి (27)ని 2014లో ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. పెళ్లైన కొంతకాలానికే శ్రావణి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇటీవల తిరిగి వచ్చిన ఆమె.. మళ్లీ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టింది. దీంతో శ్రీశైలం శ్రావణిని హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టాడు. శ్రావణి తండ్రి ఫిర్యాదుతో అసలు విషయం వెలుగుచూసింది.



## దెయ్యం పట్టినట్టు నటించి భర్తను చితక్కొట్టిన భార్య

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ పంచాయితీలోని జంగాల కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 51 ఏళ్ల గంగారాం తన భార్య లక్ష్మి చేతిలో తీవ్రంగా దెబ్బలు తిన్నాడు. మద్యానికి బానిసైన గంగారాంతో గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం లక్ష్మి, తనకు దెయ్యం పట్టిందని చెప్పి, గంగారాం నోటిలో గుడ్డలు కుక్కి, కర్రతో, ఇనుప రాడ్డుతో దాడి చేసింది. తీవ్ర గాయాలతో కేకలు వేయడంతో బంధువులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో లక్ష్మిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పక్కటెముకలు విరిగిన గంగారాం ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



## 26 కస్టర్డ్ గేట్ల ద్వారా నీటిని విడుదల

నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి వారం రోజులుగా 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4,16,324 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ప్రస్తుతం నీటి మట్టం 585 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,019 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,518 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 26 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,63,714 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.